ప్రజాతీర్పు — 2024

జమ్ముకశ్మీర్‌లో 35 ఏండ్ల రికార్డ్ స్థాయి ఓటింగ్

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు: సీఈసీ

న్యూఢిల్లీ, మే 27: ఈసారి జమ్ముకశ్మీర్‌లో రికార్డ్‌స్థాయి ఓటింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం తెలిపింది. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న జమ్ముకశ్మీర్‌లోని 5 లోక్‌సభ స్థానాల్లో 58.46శాతం ఓటింగ్ నమోదైందని, గత 35 ఏండ్లలో ఇదే అత్యధికమని సీఈసీ రాజీవ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికలతో (19.16శాతం) పోల్చితే ఓటింగ్ శాతం అనూహ్యంగా 30శాతం పెరిగిందన్నారు. 'పోలింగ్‌లో ఇక్కడి ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. త్వరలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇది సానుకూల సంకేతం' అని అన్నారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను ఈసీ త్వరలో చేపడుతుందని చెప్పారు.

హిమాచల్‌లో హోరాహోరీ

జూన్ 1న నాలుగు లోక్‌సభ స్థానాల్లో పోలింగ్

అదే రోజు ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఉపఎన్నికలు

బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధానంగా పోటీ
అంతర్గత కుమ్ములాటలతో కాంగ్రెస్ సతమతం
ప్రధాని నరేంద్రమోదీ కరిష్మాపైనే బీజేపీ భారం

సిమ్లా, మే 27: హిమాచల్‌ప్రదేశ్‌లో ఎన్నికల వేడి సెగలు పుట్టిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల చివరి విడతలో భాగంగా జూన్ 1న రాష్ట్రంలోని నాలుగు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడంతో ఆ స్థానాలకు కూడా ఈ విడతలోనే ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈసారి ఈ ఆరుగురు బీజేపీ టికెట్‌పై పోటీచేస్తున్నారు. బీఎస్పీ బరిలో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ నెలకొన్నది. 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు స్థానాలనూ(సిమ్లా, కంగ్రా, హమీర్‌పూర్, మండి) బీజేపీ కైవసం చేసుకున్నది. అయితే ఈసారి కమలం పార్టీకి గెలుపు అంత సులువు కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీకి వరద పోటు

హిమాచల్‌ప్రదేశ్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సొంత రాష్ట్రం. ఈ నేపథ్యంలో ఈసారి కూడా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చాన్స్ ఇవ్వకూడదని భావిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో యువతకు లక్ష ఉద్యోగాలు, ఉచిత విద్యుత్తు, మహిళలకు నెలవారీ ఆర్థిక సాయం వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని ప్రధాని మోదీ, అమిత్‌షా సహా బీజేపీ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దు, యూసీసీ వంటి అంశాలు ఓట్లు రాలుస్తాయని ఆశలు పెట్టుకొన్నది. ప్రధానంగా మోదీ కరిష్మాపైనే బీజేపీ ఆధారపడుతున్నది. వరదల సమయంలో కేంద్రం నుంచి సరైన సహకారం అందకపోవడంపై రాష్ట్ర ప్రజల్లో బీజేపీపై అసంతృప్తి నెలకొన్నది.

కాంగ్రెస్ పట్టు బిగించేనా?

తమ ఒకటిన్నరేండ్ల ప్రభుత్వ పనితీరును చూసి ఓటేయాలని సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు ప్రజలను కోరుతున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, కూల్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని కమలం పార్టీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపుతున్నదని, విపత్తులో సమయంలో ఎలాంటి సాయం చేయలేదని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.

ఎన్నికల్లో కీలకంగా పలు అంశాలు

మౌలిక సదుపాయాల అభివృద్ధి, కనెక్టివిటీ వంటి అంశాలు ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ప్రధానాంశాలుగా ఉన్నాయి. ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు నిర్మాణం, రైలు కనెక్టివిటీ సదుపాయాలతోపాటుగా హైవేల వెంబడి పర్యాటక సదుపాయాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై విపక్షాలు కేంద్రంలోని అధికార బీజేపీని లక్ష్యంగా చేసుకొంటున్నాయి.

ఇప్పటికే స్వల్ప మెజార్టీతో కాంగ్రెస్

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అంతర్గత పోరుతో సతమతమవుతున్నది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ పంచన చేరారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో గెలువడం తోపాటు ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించడం కాంగ్రెస్‌కు సవాల్‌గా మారింది. అధికారంలో ఉన్న రాష్ట్రంలోనే గెలువ లేకపోతే, అది ప్రతికూల సంకేతాలు పంపే అవకాశం ఉన్నదని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీలో అతిస్వల్ప మెజార్టీతో నెట్టుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలాంటి అస్థిరత లేకుండా కొనసాగించాలంటే, ఉప ఎన్నికలు జరుగుతున్న స్థానాలను గెలుచుకోవడం కాంగ్రెస్‌కు తప్పని సరి అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. లేకుంటే భవిష్యత్తులో ఏ పరిణామాలైనా చోటుచేసుకొనే అవకాశం లేకపోలేదని, ప్రభుత్వ మనుగడకే ముప్పు రావొచ్చని విశ్లేషిస్తున్నారు. 68 స్థానాలు ఉన్న హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో ఆరుగురు ఎమ్మెల్యే ఫిరాయింపు తర్వాత మెజార్టీ మార్క్ 32గా ఉన్నది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు 34 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

మే 31న విచారణకు హాజరవుతా!

ప్రజ్వల్ రేవణ్ణ ప్రకటన

బెంగళూరు, మే 27: తనపై వచ్చిన లైంగిక దాడుల ఆరోపణలపై సరిగ్గా తాను దేశం విడిచి వెళ్లిన నెల రోజులకు జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ స్పందించారు. ఈ నెల 31న సిట్ విచారణకు హాజరవుతానని ఓ వీడియో ప్రకటనలో తెలిపారు. 'విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతా. కోర్టు మీద నాకు నమ్మకం ఉంది. కోర్టు ద్వారా తప్పుడు కేసుల నుంచి నేను బయటపడగలనన్న విశ్వాసం ఉంది. నా మీద నమ్మకం ఉంచండి' అని ఆయన ఓ వీడియో ప్రకటనలో తెలిపారు. ఈ వీడియోను ఓ కన్నడ టీవీ ఛానల్ సోమవారం ప్రసారం చేసింది. అయితే ఈ వీడియో ప్రకటనను జేడీఎస్ కానీ, ప్రజ్వల్ కుటుంబం కానీ ధ్రువీకరించలేదు.

జూన్ 1న ఇండియా కూటమి సమావేశం

రాలేమన్న తృణమూల్

న్యూఢిల్లీ, మే 27: లోకసభ ఎన్నికల్లో పనితీరు, రాబోయే ఫలితాలపై చర్చించేందుకు 'ఇండియా కూటమి' పార్టీలు జూన్ 1న న్యూఢిల్లీలో సమావేశం కాబోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల చివరి దశ పోలింగ్ రోజు మధ్యాహ్నం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. కాగా, ఈ సమావేశానికి హాజరుకావటం లేదని తృణమూల్ కాంగ్రెస్ తెలిపింది. ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉన్నందున సమావేశానికి రాలేమని టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ, పార్టీ జనరల్ సెక్రెటరీ అభిషేక్ బెనర్జీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ సమావేశానికి నేతృత్వం వహిస్తారని తెలిపింది.

హాలీవుడ్ నటుడు జానీ వాక్టర్ హత్య!

వాషింగ్టన్: ప్రముఖ హాలీవుడ్ నటుడు జానీ వాక్టర్(37) హత్యకు గురయ్యాడు. లాస్ ఏంజెల్స్‌లో దొంగలు జరిపిన కాల్పుల్లో ఆయన మరణించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తాకథనాలు వెలువడ్డాయి. 'జనరల్ హాస్పిటల్' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు అందుకున్న వాక్టర్ మృతిని అతడి తల్లి, ఏజెంట్ నిర్ధారించారు. కొంత మంది దొంగలు వాక్టర్‌పై తుపాకీ కాల్పులకు పాల్పడ్డారని, ఈ ఘటనలో తన కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని వాక్టర్ తల్లి మీడియాకు తెలిపింది.

అదానీపై ఆరోపణలు.. మోదీ, రాహుల్‌పై దావా

న్యూఢిల్లీ, మే 27: అదానీ గ్రూప్‌పై కల్పిత, తప్పుడు ఆరోపణలు చేయకుండా ప్రధాని మోదీ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీలను అడ్డుకోవాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అదానీ గ్రూప్‌పై చేస్తున్న అసంబద్ధమైన ఆరోపణలు, అదానీ గ్రూప్ మార్కెట్ విలువకు, ఇన్వెస్టర్లకు హాని తలపెడుతున్నదని, అలాంటి ఆరోపణలు చేయకుండా వారిని నిరోధించాలని పిటిషన్‌దారు హైకోర్టును కోరాడు. స్టాక్ ఇన్వెస్టర్, రైతుగా తనను తాను పేర్కొన్న సుర్జిత్ సింగ్ యాదవ్ ఈ పిటిషన్ వేశారు. రాహుల్‌గాంధీ, ప్రధాని మోదీలను ప్రతివాదులుగా తన పిటిషన్‌లో చేర్చాడు. అదానీకి వ్యతిరేకంగా వాస్తవాలను వక్రీకరించారని పిటిషన్‌లో రాహుల్‌గాంధీపై ఆరోపించారు. అదానీ కంపెనీల ప్రతిష్టను ప్రజలు, మార్కెట్ ఇన్వెస్టర్ల దృష్టిలో తగ్గించారని యాదవ్ ఆరోపించారు.

డీఆర్‌డీవో చీఫ్ సమీర్ పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ: భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) చీఫ్ సమీర్ వీ కామత్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం ఓ ఏడాదిపాటు పొడిగించింది. శాస్త్రవేత్త కామత్ 2022 ఆగస్టు 25న డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా, డీఆర్‌డీవో చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీ కాలాన్ని 2024 జూన్ 1 నుంచి 2025 మే 31 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పొడిగిస్తూ క్యాబినెట్ నియామక కమిటీ ఆమోదం తెలిపింది.

ప్రతిపక్షానికి చోటు ఉంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లేది!

- రూపీ అంతర్జాతీయ కరెన్సీ ఇప్పుడే కాలేదు
- ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): రాజకీయాల్లో ప్రతిపక్షానికి చోటు ఉన్నప్పుడే ప్రజాస్వామ్యమనేది వర్ధిల్లుతుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. దేశంలో నెలకొన్న అసమానతలు, నిరుద్యోగం తనను ఎంతగానో ఆందోళనకు గురిచేస్తున్నట్టు చెప్పారు. తయారీ, సేవల రంగాల్లో పురోగతి సాధించామా? అన్నది పక్కనబెడితే, దేశంలో నిరుద్యోగం పెరిగిందన్న మాట వాస్తవమేనన్నారు. వాతావరణ మార్పులు, కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్ కారణంగా ఉద్యోగాల్లో కోత, ప్రపంచీకరణ తదితర అంశాలు రానున్న రోజుల్లో కొత్త సవాళ్లను తీసుకురావొచ్చని అన్నారు.

డాలర్‌కు బందీగానే రూపాయి

రూపాయి అంతర్జాతీయ కరెన్సీగా మారడానికి ఇంకా చాలా సమయం పడుతుందని దువ్వూరి అన్నారు. ఇప్పటికీ, రూపాయి అమెరికన్ డాలర్‌కు బందీగానే ఉన్నదని గుర్తు చేశారు. విదేశీ మారకపు మార్కెట్‌లకు సంబంధించిన విషయాల్లో ఆర్బీఐ జోక్యం తగ్గించుకోవాలని సూచించారు.

రాహుల్, కేజ్రీవాల్‌కు పాక్ మద్దతుపై దర్యాప్తు చేయాలి

ఇది చాలా తీవ్ర అంశం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు పాకిస్థాన్ మాజీ మంత్రి చౌధరి ఫవాద్ హుస్సేన్ నుంచి ప్రశంసలు, మద్దతు రావడంపై ప్రధాని మోదీ స్పందించారు. ఇది చాలా తీవ్రమైన అంశమని, దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉన్నదని సోమవారం ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'కొంత మంది వ్యక్తులకు మనకు వ్యతిరేకంగా శత్రుత్వాన్ని కలిగివున్న పాకిస్థాన్ నుంచి మద్దతు ఎందుకు వస్తుందో నాకు అర్థం కావడం లేదు. ఇది ఆందోళన కలిగించే అంశం' అని అభిప్రాయపడ్డారు. భారతీయ ఓటర్లు పరిపక్వత చెందిన వాళ్లని, సరిహద్దుల వెంబడి నుంచి వచ్చే స్టేట్ మెంట్లు భారత్‌లో ఎన్నికలపై ప్రభావం చూపలేవని మోదీ అన్నారు. పాక్ నేత హుస్సేన్ ఈనెల మొదట్లో రాహుల్ గాంధీని ప్రశంసిస్తూ పెట్టిన ఓ పోస్టు చర్చనీయాంశమైంది. అలాగే జైలు నుంచి కేజ్రీవాల్ విడుదలపై ఆయన గత శనివారం చేసిన పోస్టు హెడ్‌లైన్స్‌లో నిలిచింది. 'మోదీజీ మరో యుద్ధంలో ఓడిపోయారు. కేజ్రీవాల్ విడుదల అయ్యారు. ఇది భారతదేశానికి శుభవార్త' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. విద్వేష, అతివాద శక్తులను శాంతి, సామరస్యం ఓడించాలని కోరుకుంటున్నానని మరో పోస్టులో పేర్కొన్నారు. హుస్సేన్ వ్యాఖ్యలను కేజ్రీవాల్ ఖండించారు. తమ దేశ సమస్యలను పరిష్కరించుకొనే సామర్థ్యం తమకు ఉన్నదని, ముందు మీ దేశం దుస్థితిని చూసుకోండి అంటూ పాక్ నేతకు కౌంటర్ ఇచ్చారు.

బెయిల్ వారం రోజులు పొడిగించండి

సుప్రీంకోర్టులో సీఎం కేజ్రీవాల్ పిటిషన్

న్యూఢిల్లీ, మే 27: లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం తనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను మరో వారం రోజులు పొడిగించాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈమేరకు ఆయన తరపు న్యాయవాదులు కోర్టులో తాజాగా పిటిషన్ వేశారు. 'అనారోగ్య సమస్యలకు సంబంధించి ప్రాథమిక వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. మరికొన్ని వైద్య పరీక్షలు జూన్ 3 నుంచి జూన్ 7 వరకు జరపాల్సి ఉందని వైద్య బృందం తెలిపింది. కీలకమైన వైద్య పరీక్షలు పూర్తిచేసేందుకు మరో 7 రోజులు బెయిల్ అవసరం' అంటూ కేజ్రీవాల్ తరపు న్యాయవాదులు పిటిషన్‌లో కోరారు. జూన్ 9న కేజ్రీవాల్ సరెండర్ అవుతారని తెలిపారు. పిటిషన్ సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ ముందుకు రానున్నట్లు తెలిసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌కు మే 10న అత్యున్నత న్యాయస్థానం 21 రోజుల పాటు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది.

బిభవ్ కుమార్‌కు బెయిల్ నిరాకరణ

కోర్టులో స్వాతి మలివాల్ కన్నీటిపర్యంతం

న్యూఢిల్లీ: ఆప్ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్‌కుమార్‌కు కోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ కేసులో ఇరు వర్గాల వాదనలు విన్న మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గౌరవ్ గోయల్ బిభవ్‌కుమార్‌కు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించారు. కోర్టుకు హాజరైన ఎంపీ స్వాతిమలివాల్, విచారణ సమయంలో బిభవ్‌కుమార్ తరపు న్యాయవాదుల మాటలకు కన్నీటి పర్యంతమయ్యారు. ఢిల్లీ సీఎం అధికారిక నివాసంలో సీసీటీవీ కవరేజ్ లేని ప్రదేశాన్ని ఎంచుకొని, తనపై దాడి జరిగిందన్న తప్పుడు ఆరోపణలు ఆమె చేస్తున్నారని, ముందస్తు ప్రణాళికతో ఆమె ఇదంతా చేస్తున్నదని నిందితుడి తరపు న్యాయవాదులు వాదించారు. దీంతో ఆప్ ట్రోల్ ఆర్మీ తనపై దుష్ప్రచారం చేస్తున్నదని మలివాల్ వాపోయారు. బిభవ్ బెయిల్‌పై జైలు నుంచి బయటకువస్తే.. తన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని కోర్టుకు తెలిపారు.

'మ్యానిఫెస్టో' వాగ్దానాలు అవినీతి కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఎన్నికల మ్యానిఫెస్టోలో తాయిలాలను ప్రకటించే రాజకీయ పార్టీలకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. మ్యానిఫెస్టోల్లో పొందుపరిచే వాగ్దానాలు ఎన్నికల చట్టాల ప్రకారం అవినీతి కిందకు రావని స్పష్టం చేసింది. కర్ణాటకలోని చామరాజ్‌పేట్ శాసన సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ 2023లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించడాన్ని సవాల్ చేస్తూ అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్ శశాంక జే శ్రీధర కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక సాయం చేస్తామని వాగ్దానాలు చేసిందని.. ఇది అవినీతితో కూడిన ఎన్నికల కార్యకలాపం అవుతుందని ఆరోపించారు. దీనిపై హైకోర్టు తీర్పు చెప్పు, తాము అధికారంలోకి వస్తే, అమలు చేయబోతున్న విధానాల గురించి రాజకీయ పార్టీ చెప్పడం అవినీతి కిందకు రాదని స్పష్టం చేసింది. దీనిపై అప్పీలును సుప్రీంకోర్టు తాజాగా విచారించి డిస్మిస్ చేసింది.

నాలుగేండ్లుగా నిద్రపోయారా?

- గుజరాత్ ప్రభుత్వంపై నమ్మకం లేదు
- రాజ్‌కోట్ ఘటనపై హైకోర్టు ఆగ్రహం
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు
- గతంలో సూచనలు చేసినా మళ్లీ ప్రమాదాలు జరగడంపై తీవ్ర అసంతృప్తి

గాంధీనగర్, మే 27: గుజరాత్‌లోని రాజ్‌కోట్ గేమ్ జోన్ అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర హైకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్‌తోపాటు ఇతర అనుమతులు లేకుండా నగరంలో అలాంటి రెండు గేమింగ్ జోన్లు గత రెండేండ్లకు పైగా నడుస్తుండటంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ విధమైన నిర్లక్ష్య వైఖరిపై రాజ్‌కోట్ మున్సిపాలిటీ, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడింది. గతంలో సూచనలు చేసినా, రాష్ట్రంలో ఇలాంటి పలు ఘటనలు కొనసాగాయని పేర్కొంటూ.. ఇకపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తాము విశ్వసించలేమని స్పష్టం చేసింది. 'గత రెండున్నర ఏండ్లుగా ఇది నడుస్తున్నది(రాజ్‌కోట్ గేమింగ్ జోన్ కార్యకలాపాలకు సంబంధించి). మీకు కండ్లు కనిపించడం లేదని మేం అనుకోవాలా? మీరు, మీ అధికారులు ఏం చేస్తున్నారు?' అని రాజ్‌కోట్ మున్సిపాలిటీని హైకోర్టు నిలదీసింది. ఫైర్ సేఫ్టీ ధ్రువీకరణ విచారణలు గత నాలుగేండ్లుగా అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పినప్పుడు.. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడింది. 'మీకు కండ్లు కనిపించడం లేదా? లేక నిద్రపోయారా? ఇప్పుడు స్థానిక వ్యవస్థతో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా మేం విశ్వసించలేం' అని పేర్కొన్నది.

సూచనలు చేసిన తర్వాతా ప్రమాదాలు..

గతంలో ఇలాంటి అనేక ఘటనలు జరిగిన విషయాన్ని గుజరాత్ హైకోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. గత నాలుగేండ్లలో తాము అనేక నిర్ణయాలు వెలువరించామని, సూచనలు చేశామని, అయినా ఆ తర్వాత కూడా రాష్ట్రంలో ఆరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయని రాష్ట్ర సర్కార్ తీరును ఎండగట్టింది. రాష్ట్ర అధికార యంత్రాంగం సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ప్రజలు చనిపోతున్నారని హైకోర్టు అభిప్రాయపడింది.

అగ్నిప్రమాదానికి కారణం ఏంటి?

రాజ్‌కోట్ అగ్నిప్రమాదానికి కారణాలపై పలు వాదనలు వినిపిస్తున్నాయి. వెల్డింగ్ వర్క్ సమయంలో ఎగిసిపడిన నిప్పురవ్వలు ప్లాస్టిక్‌పై పడటంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తున్నది. దీనికి సంబంధించిన ఓ సీసీటీవీ ఫుటేజ్ ఒకటి తాజాగా బయటకు వచ్చింది. అయితే విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని మరోవైపు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. మంటలు చెలరేగి, ప్రవేశద్వారం సమీపంలోని తాత్కాలిక నిర్మాణం కూలిపోవడంతో లోపలున్న వారు బయటకు వెళ్లలేక పోయారని తెలుస్తున్నది.

2 వేల మంది సజీవ సమాధి!

పపువా న్యూ గినియాలో భారీగా పెరిగిన మృతుల సంఖ్య

మెల్‌బోర్న్, మే 27: పపువా న్యూ గినియాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో సజీవ సమాధి అయిన వారి సంఖ్య భారీగా పెరుగుతున్నది. శిథిలాల కింద 2 వేల మంది ఉన్నట్లు ఆ దేశం ఐక్యరాజ్యసమితికి (ఐరాస) తెలిపింది. ఆ దేశానికి చెందిన జాతీయ విపత్తు కేంద్రం ఐరాసకు లేఖ రాసింది. కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 2 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నది. అంతర్జాతీయ సాయం కావాలని ఆ దేశం ఐరాసను వేడుకుంది. ఐరాస తొలుత మృతుల సంఖ్యను 670గా అంచనా వేయగా, దీనికి మూడు రెట్లు మరణాలున్నాయని పపువా న్యూ గినియా ప్రభుత్వం చెబుతున్నది. ఆస్ట్రేలియా ప్రభుత్వం సోమవారం విమానం, ఇతర పరికరాలను సాయంగా పంపింది. శుక్రవారం రాత్రి పపువా న్యూ గినియాలోని పర్వతప్రాంతాల్లో భారీ వర్షాలు కురియటంతో అక్కడి వందలాది గ్రామాలపైకి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వేలాది ఇండ్లు నేలమట్టమయ్యాయి. ఒకప్పుడు ఆస్ట్రేలియాకు వలస దేశంగా ఉన్న పపువా న్యూ గినియా 1975లో స్వాతంత్ర్యం పొందింది.

రక్త నమూనా మార్చేసి.. నివేదికను తారుమారు చేసి!

పుణె యాక్సిడెంట్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి

కుమారుడ్ని కాపాడుకొనేందుకు తండ్రి జిమ్మిక్కులు

వైద్యులకు లంచం ఇచ్చినట్టు పోలీసుల వెల్లడి

డాక్టర్ శ్రీహరి

డాక్టర్ అజయ్

పుణె, మే 27: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహారాష్ట్రలోని పుణె యాక్సిడెంట్ కేసులో హైడ్రామా నడుస్తున్నది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మైనర్‌ను తప్పించేందుకు అతని తండ్రి అడ్డదారులు తొక్కుతున్నాడు. కేసులో తమ కుమారుడు చిక్కకుండా ఆ 17 ఏండ్ల టీనేజర్ తండ్రి జిమ్మిక్కులకు పాల్పడుతున్న వైనాన్ని పుణె పోలీసులు తాజాగా బహిర్గతం చేశారు. రక్తంలో ఆల్కహాల్ ఆనవాళ్లు తేలకుండా చేసేందుకు ఏకంగా రక్త నమూనా నివేదికను తారుమారు చేశారట. పరీక్ష నిమిత్తం నిందితుడి నుంచి తీసుకొన్న రక్తాన్ని చెత్తకుప్పలో పడేసి, దాని స్థానంలో వేరే వ్యక్తి రక్తాన్ని పెట్టి, నివేదికను రూపొందించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ మేరకు నివేదిక తయారు చేసేందుకు నిందితుడి తండ్రి ప్రభుత్వ దవాఖాన వైద్యులతో బేరసారాలు నడిపినట్టు పుణె పోలీసు కమిషనర్ అమితేశ్ కుమార్ సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ తతంగానికి సంబంధించి సస్సూన్ జనరల్ హాస్పిటల్‌కి చెందిన ఫోరెన్సిక్ మెడికల్ విభాగం హెడ్ డాక్టర్ అజయ్ తావరే, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహరి హల్నోర్‌ను అరెస్టు చేశామని తెలిపారు. ఆదివారం వైద్యుల నుంచి అందుకొన్న నివేదికలో నిందితుడి రక్తంలో ఆల్కహాల్ ఆనవాళ్లు లేవని పేర్కొన్నారని, అయితే డాక్టర్ అజయ్ తావరే డైరెక్షన్‌లో రక్తనమూనాలను తారుమారు చేసినట్టు తమ దర్యాప్తులో తేలిందని అమితేశ్ కుమార్ పేర్కొన్నారు. ఇద్దరు టెకీలు మరణించిన ఈ యాక్సిడెంట్‌ను చేసిన సమయంలో నిందితుడైన మైనర్ మద్యం సేవించినట్టు పోలీసులు చెబుతున్నారు. పుణె పోలీసు కమిషనర్ అమితేశ్ కుమార్ మరో కీలక విషయం వెల్లడించారు. ముందస్తు జాగ్రత్తగా డీఎన్‌ఏ పరీక్ష కోసం తాము నిందితుడి నుంచి మరో రక్త నమూనాను తీసుకొని, దాన్ని వేరే దవాఖానకు పంపించామని తెలిపారు. సస్సూన్ దవాఖాన వైద్యులు ఇచ్చిన నివేదికను తారుమారు చేసినట్టు మరో దవాఖాన నివేదిక తేల్చిందని పేర్కొన్నారు.

పుణె పోర్షే కారు ఘటన జరిగినా కొందరిలో మార్పు రావడం లేదు. చట్టాలంటే భయం లేకుండా, ఎడుటివారి ప్రాణాలంటే లెక్క లేకుండా వ్యవహరిస్తున్నారు. ముంబైలోని శివాజీ చౌక్ ప్రాంతంలో ఓ టీనేజర్(17) బీఎమ్‌డబ్ల్యూ కారు నడుపుతుండగా.. శుభమ్ మతాలియా(21) అనే యువకుడు కారు బానెట్‌పై కూర్చొన్నాడు. మతాలియాను, టీనేజర్ తండ్రిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

గుప్తా బ్రదర్స్ అరెస్ట్!

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాలో వేల కోట్ల రూపాయల కుంభకోణంలో నిందితులుగా ఉన్న గుప్తా బ్రదర్స్‌ను వేరొక కేసులో ఉత్తరాఖండ్‌లో అరెస్ట్ చేసినట్లు వార్తలు వచ్చాయి. రాష్ట్రంలోని ప్రముఖ బిల్డర్ సతీందర్ సింగ్ సాహ్నీ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. తన ఆత్మహత్యకు కారణం గుప్తా బ్రదర్సేనని ఆయన సూసైడ్ నోట్‌లో రాశారు. అయితే ఇప్పుడు అరెస్టయిన అజయ్ గుప్తా, ఆయన బావ అనిల్ గుప్తా కొన్నేళ్ల క్రితం దక్షిణాఫ్రికాకు పారిపోయిన అజయ్ గుప్తా, అతుల్ గుప్తా, రాజేశ్ గుప్తా, అనిల్ గుప్తాలలో ఇద్దరేనా? కాదా? అనే అనిశ్చితి ఏర్పడింది. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమాతో సాన్నిహిత్యాన్ని ఆధారంగా చేసుకుని ఈ ముగ్గురు అన్నదమ్ములు వేల కోట్ల ర్యాండ్స్ (దక్షిణాఫ్రికా కరెన్సీ)ని కొల్లగొట్టినట్లు కేసులు నమోదయ్యాయి. తాజాగా ఇద్దర